

ప్రియదత్త వీక్లీ 29 జనవరి, 2003

# క్షమించు మిత్రమా!

"సార్! మిమ్మల్ని మేడమ్‌గారు పిలుస్తున్నారు!"

– రిసెప్షన్ హాలులో కూర్చునివున్న రామకృష్ణతో ప్యూను చెప్పాడు.

"ఏ మేడమ్?"

"జనరల్ మేనేజరుగారు!" ఎదురుగా వున్న గ్లాస్‌ఛాంబర్ వైపు చూపిస్తూ అన్నాడు.

రూమ్‌లో అడుగుపెట్టిన రామకృష్ణను "రండి... కూర్చోండి!" అని ఆహ్వానించింది జయంతి.

"ఇంటర్వ్యూకు వచ్చారా?" అని అడిగింది రామకృష్ణ కూర్చున్నాక.

'అవు'నన్నట్టు తలూపాడు.

"నేను గుర్తున్నానా?"

"గుర్తున్నారు."

"నేను ఏరి కోరి మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానని మా తల్లిదండ్రుల్ని మీ ఇంటికి పంపాను. కాని, మీరు నన్ను తిరస్కరించారు. గుర్తుందా?"

"నేను మిమ్మల్ని గాని, మీ సంబంధాన్ని గాని తిరస్కరించలేదు. అప్పుడే పెళ్ళి చేసుకోనని చెప్పాను. ఉద్యోగం లేకుండా భార్య జీతం మీద ఆధారపడి బ్రతకడం నాకు ఇష్టంలేక అలా అన్నాను."

"చదువుకున్నారు... ఉద్యోగం దొరక్కుండా పోతుందా?"

"మీ సంబంధం వచ్చిన మూడేళ్లకు నాకు స్థిరమైన ఉద్యోగం దొరికింది."

"మీరు మా సంబంధం ఒప్పుకొనివుంటే మా నాన్నగారు ఆరోజే మీకు ఎక్కడో ఒకచోట ఉద్యోగం చూపించేవారు."

"మా నాన్నగారు కూడా ఆ పని చేసేవారే! నేనే వద్దన్నాను. ఉద్యోగం స్వశక్తితో సంపాదించుకోవాలన్నది నా ఆశయం!"

"మీ ఆశయం ఏమైనా కావచ్చు. కాని, నన్ను మాత్రం చాలా అవమానపరచారు. ఆ పాపం మిమ్మల్ని ఇంకా వెంటాడుతున్నట్లుంది. ఇప్పుడు మీరు ఉద్యోగం చేయటం లేదా?"

"చేస్తున్నాను... ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీలో!"

"పెళ్ళయిందా?"

అయిందన్నట్లు తలూపాడు.

"మీ భార్య చదువుకుందా?"

"చదువుకుంది."

"ఉద్యోగం చేస్తుందా?"

"ఒకరకంగా ఉద్యోగమే!"

"పాపం... ఎలా కాపురం చేస్తోందో- ఇన్ని 'ఇగో'లున్న మీతో..?! ఐ పిటీ హర్!" అని, "మీకు ఫోన్ ఉందా?" అని అడిగింది.

"ఉంది..."

"ఫోన్‌నెంబర్ ఇచ్చి వెళ్లండి. సెలెక్ట్ అయితే మీకు ఫోన్‌చేసి చెప్తాను. ఇంటర్వ్యూ బోర్డులో నేనూ ఉన్నాను" అంది.

ఫోన్‌నెంబర్ చెప్పాడు.

పేపరు మీద రాసుకున్న నెంబర్ వైపు చూస్తూ- "అరె! ఈ ఫోన్‌నెంబరు మా ఎం.డి. నీరజగారిది!" అంది ఆశ్చర్యంగా జయంతి.

"ఆవిడ నా భార్య! ఈరోజు ఇంటర్వ్యూలు ఉన్నాయని నన్ను సహాయానికి పిలిచింది!" అంటూ కదిలాడు.

రామకృష్ణ తన చెంపమీద బలంగా కొట్టినట్లు ఫీలయింది జయంతి. వెంటనే ఆమెకు అతన్ని దెబ్బతియ్యాలన్న ఆవేశం కూడా వచ్చింది.

"హుఁ..! అవసరాన్ని బట్టి ఆదర్శాలు మార్చుకునే మనుషులు మీరు. పేరుకు ఓ ఉద్యోగం

చేస్తున్నారు- ప్రజలకు 'భార్య మీద ఆధారపడి బ్రతకడం లేదు' అని చెప్పుకోవడానికి! కాని, ఆవిడ వల్ల వచ్చే కార్లు, బంగళాలు, సుఖాలు మాత్రం కావాలి మీకు!"

"మీరు ఇక్కడ జి.ఎం.గా చేరి ఎన్ని రోజులయింది?" తలుపు దగ్గర నిలబడి అడిగాడు రామకృష్ణ.

"వారం రోజులయింది!" ఎందుకన్నట్లు ఆశ్చర్యంగా చూస్తూ చెప్పింది.

"ఈ సంవత్సరం ఎం.డి. ఆన్యువల్ రిపోర్ట్ చదివారా?"

"సగం చదివాను. ప్రాఫిట్స్, ఖర్చులు... అవన్నీ చూశాను."

"ఒకసారి పూర్తిగా చదవండి. ముఖ్యంగా చివరి మూడు పేజీలు!" అని వెళ్లిపోయాడు.

వెంటనే ఫైలింగ్ క్యాబినెట్ తెరచి 'డైరెక్టర్స్ రిపోర్ట్' అని రాసివున్న ఫైలు తీసి చివరి మూడు పేజీలు చదవసాగింది.

"ఈ సంవత్సరం మన కంపెనీ అత్యధిక లాభాలు గడించడానికి కారణమైన ప్రతి ఒక్క ఉద్యోగికీ నా అభినందనలు తెలుపుకుంటున్నాను. మరో మంచివార్త ఏమిటంటే లెక్కలు వక్రీకరించకుండా పూర్తి టాక్సు కట్టినందుకు గవర్నమెంటు నుంచి ప్రశంసాపత్రం కూడా మన సంస్థకు లభించింది.

ఇకపోతే ఈ సంవత్సరం నుంచీ కంపెనీ లాభాలన్నీ 'సొసైటీ వెల్‌ఫేర్ ఫండ్' అని ఒక ఫండ్ క్రియేట్ చేసి అందులో జమ చేయబడుతుంది. మన రాష్ట్రంలో ప్రతిభ ఉండీ చదువుకోవడానికి డబ్బులు లేనివాళ్ళకు ఈ ఫండ్ సహాయం చేస్తుంది. అటువంటివారిని గుర్తించడానికి సంస్థ కొంతమందికి ఉద్యోగాలిచ్చి ఈ పని అప్పగిస్తుంది. వారి జీతభత్యాలు ఫండ్ నుంచే చెల్లింపబడతాయి.

నా భర్త ఉద్యోగం చేస్తున్నారు కనుక, ఆయన సంపాదన మా సంసారానికి సరిపోతుంది కనుక, ఇకనుంచీ ప్రతినెలా నా జీతం- సంస్థ అభివృద్ధికై పాటుపడే ఉద్యోగులలో ఒక్కొక్కరిని ఒక్కో నెల ఎంపిక చేసి వారికి బహుమతిగా ఇవ్వబడుతుంది.

చివరిగా... అనుక్షణం నాకు తోడుగా ఉంటూ, అన్ని నిర్మాణాత్మకమయిన ఆలోచనలను నాకందించిన నా భర్త రామకృష్ణగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను."

ఫైలు మూసేసి అలాగే కూర్చుండిపోయింది జయంతి.

తను ఇన్ని మాటలన్నా కోపం తెచ్చుకోకుండా- తన మాటలకు జవాబులు మాటలతో కాక తను చేసే మంచిపనులతో జవాబు చెప్పిన రామకృష్ణ నిజంగా గొప్పవాడు. చిన్నసహాయం చేస్తేనే పదిమందికీ గొప్పగా చెప్పుకునే మనుషులున్న ఈ లోకంలో... ఇంత చేస్తూ కూడా నిండుకుండలా తొణకని రామకృష్ణ దంపతులు అభినందనీయులు. భార్యను హింసించైనా డబ్బు కోసం పుట్టింటికి తరిమే అత్యాశపరులున్న ఈ లోకంలో... భార్య వల్ల వచ్చిన లక్షల ఆదాయాన్ని ప్రజాహిత కార్యాలకు వినియోగించడానికి నిర్ణయించిన రామకృష్ణ ఆదర్శనీయుడు.

ఆ తర్వాత నీరజ, రామకృష్ణలతో పాటు జయంతి కూడా ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆమెతో అసలేమీ జరగనట్లే నవ్వుతూ మాట్లాడుతున్న రామకృష్ణ స్థితప్రజ్ఞత ఆమెనెంతో ఆశ్చర్యపరిచింది. 'ఇతనికి భార్యగానే అక్కర్లేదు.., ఓ స్నేహితురాలిగా ఉన్నా- తను ఎంతో నేర్చుకోవచ్చు. అంతగా ప్రభావితం చేయగలడు రామకృష్ణ- తన మంచితనంతో!' ...అనుకుంది.

ఇంటర్వ్యూ అయ్యాక రామకృష్ణను క్షమాపణ అడగటానికి గబగబా బయటకు వచ్చింది. అప్పటికే రామకృష్ణ తన స్కూటర్‌పై వెళ్లిపోతున్నాడు.

'ఈసారి కలిసినప్పుడు రామకృష్ణను క్షమించమని అడగాలి. అతను తప్పకుండా తనను క్షమిస్తాడు. క్షమించే హృదయం లేనివాడు అంత గొప్పవాడు కాలేడు' ...అనుకుంది జయంతి.

పాఠకులకు, సాహితీప్రియులకు **జయంతి పబ్లికేషన్స్** అందిస్తున్న అపూర్వ అవకాశం!

**సి.ఎన్. చంద్రశేఖర్ రచనలు**

'నీ కోసమే...'
(కథాసంపుటి)
వెల : రూ॥ 100 /-



'కనులు మాటలాడునని...'
(కథాసంపుటి)
వెల : రూ॥ 60 /-



**ఈ రెండు పుస్తకాల సెట్‌ని ఒకేసారి కొనదలచుకుంటే కేవలం రూ॥ 100 /- లకే మీకు లభిస్తాయి.**

మీ ఆర్డర్లు
మనీయార్డరు, లేదా డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో
పంపించాల్సిన చిరునామా

**ఎస్వీ కృష్ణజయంతి**

**203, కంచి రెసిడెన్సీ, 11-19, పి & టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500060.**